క్లుప్తంగా

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్లు వర్తింప జేయాలని రజక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి రామ్మూర్తి డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. రజకుల లాండ్రీ షాపులకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడచినా బిల్లులు చెల్లించడం లేదన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చినా..ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాజేశం, అశోక్, రమేశ్, కుమారస్వామి, సంపత్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పై దాడి చేసిన వారిని శిక్షించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లికార్జున్‌పై దాడి చేసి కులం పేరిట అవమానపర్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు ఖాజా, రాజేశం, లక్ష్మి, జ్యోతి, కనకయ్య పాల్గొన్నారు.

యాష్ టిప్పర్ ఓనర్లతో సమావేశం


ఓనర్లతో సమావేశమైన కౌశిక హరి


రామగుండం: పదిహేను రోజుల క్రితం యాష్ టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్లు తమ వేతనాలను పెంచేందుకు కృషి చేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు, కార్మిక సంఘం నేత కౌశిక హరికి విజ్ఞప్తి చేస్తూ డిమాండ్ నోటీసు అందజేశారు. దీనిపై స్పందించిన కౌశిక హరి మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో యాష్ టిప్పర్ ఓనర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టిప్పర్ ఓనర్లతో మాట్లాడుతూ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాల పెంపు ప్రతిపాదనలను ఓనర్లకు వివరించారు. దీనిపై ఓనర్లు స్పందిస్తూ వారం రోజులు గడువు ఇవ్వాలని కోరారని, తాము ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. వచ్చే సోమవారం ఓనర్లతో మళ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్


బాధితుడిని ఓదార్చుతున్న జెడ్పీ చైర్మన్

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామగల్ల రమేశ్ తండ్రి రాములు అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. రాములు మృతికి గల కారణాలు తెలుసుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్ ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

ఎలిగేడు: మండలంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శ్రీకంఠమహేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపనకు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు భూసారపు నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు పూదరి వెంకటేశంగౌడ్, గీతా కార్మికులు,గౌడసంఘం పెద్దలు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- సబ్జెక్టు టీచర్ల సూచనలతో వంద రోజుల ప్రణాళిక
- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

ఎలిగేడు/రామగుండం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు షురూ అయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు పేపర్లు మాత్రమే నిర్వహిస్తుండడం, క్వశ్చన్ పేపర్‌లో మార్పులు చేయడంపై విద్యార్థులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పది జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే లక్ష్యసాధన సులభమేనంటున్నారు.

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి, ఎక్కువ 10 జీపీఏలను సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికల రూపొందిస్తున్నారు. నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..

మండలంలోని మూడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 103 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించిన ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక దృష్టిని సారించారు. వారిలో మనోధైర్యాన్ని నింపి సలహాలు, సూచనలు చేస్తూ చదువులో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలోనే ఎక్కువగా 10 జీపీఏలు సాధించి ఆదర్శ మండలంగా ముందుడేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు శ్రమిస్తున్నారు.

రెండు పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం..

విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సత్యసాయి ట్రస్టు సేవా సంస్థ ఆధ్వర్యంలో రాగి జావ, ఎలిగేడు, ధూళికట్ట పాఠశాలల్లో ధూళికట్ట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోలు సత్యనారాయణ అల్పాహారం అందిస్తున్నారు.

స్టడీఅవర్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాం



పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాం. స్టడీ అవర్స్‌లో వచ్చిన డౌట్స్‌ను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. అందరి సహకారంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– ఎస్.అక్షర, విద్యార్థిని, ధూళికట్ట హైస్కూల్

పట్టుదలతో చదువుతున్నాం



పాఠశాలల్లో ఉత్కతమ విద్యను అందించడం తోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగుతులు నిర్వహిస్తుండటంతో పట్టుదల కృషితో చదువుతున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకవస్తాం.

– పూర్ణచందర్, విద్యార్థి, ఎలిగేడు జెడ్పీహెచ్ఎస్

సామాజిక అంశాలపై పట్టు కలిగి ఉండాలి



ఇండియా రిలీఫ్ ఫ్యూచర్ పాఠ్యాంశంపై పట్టు సాధిస్తే ఇందులో నుంచి షార్ట్ బిట్స్ వస్తాయి. భారతదేశ పటం గీయించి అందులో హిమాలయాలు, దక్కన్ పీఠభూమి, నదులు, పర్వతాలు గుర్తించాలని ప్రశ్నలు తప్పక వస్తాయి. ప్రతీ ప్రశ్నను రెండుసార్లు అర్థమయ్యే వరకూ చదివితే అవగాహన వస్తుంది దానికి సరిపడా సమాధానం రాసే అవకాశం ఉంటుంది.

– ఇరుగురాల ఓదెలు, సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయుడు

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం



సుల్తాన్‌పూర్ పాఠశాలలో పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థుల విద్యాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి వారిని కూడా ఎక్కువ మార్కులు సాధించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– నలుమాసు సుదర్శనం, హెచ్ఎం, సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు అండ

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: నిరుపేద కుటుంబాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలకు అయ్యే ఖర్చులో కొంత మొత్తాన్ని సర్కార్ సాయంగా అందిస్తూ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 174 మంది లబ్ధిదారులకు రూ.86,62,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు తనవంతుగా శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కులక్ష్మణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం బ్రోచర్ ఆవిష్కరణ

పట్టణంలోని ప్రగతినగర్‌లో ట్రినిటీ ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఈ నెల 22న మల్టీస్పెషాలిటీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సన్‌షైన్ హాస్పిటల్, కరీంనగర్ వారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేస్తారని తెలిపారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సాక్షి స్పందన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని రాజేశ్ థియేటర్ ముందు ప్రధాన రహదారిపై వెలగని విద్యుత్ లైట్లకు మంగళవారం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇటీవల 'బల్దియాలో వెలగని వీధి దీపాలు' అనే శీర్షికన 'సాక్షి' ఫొటో స్టోరీ ప్రచురించింది. సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుపోవడంతో, స్పందించిన కమిషనర్ ఎలక్ట్రికల్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లెజెండర్ – 2022 జాతీయ అవార్డు గ్రహీత చొప్పదండి మల్లేశంను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి..

రామగిరి: మండలంలోని బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇల్లటం ప్రదీప్‌ను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ శారద, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో శ్రీనివాస్ దంపతులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

సుల్తానాబాద్: పట్టణంలోని పూసలకు చెందిన ఉస్తే శ్రీనివాస్ ముదిరాజ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సమక్షంలో టీడీపీలో చేరారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్ కొనసాగుతున్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈసందర్భంగా శ్రీనివాస్ తెలిపారు .

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కమాన్‌పూర్: ఈ నెల 19న మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న 'కంటి వెలుగు'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముత్తారం: కంటివెలుగు విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం ముత్తారం గ్రామ పంచాయతీలో పాలక వర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. 19వతేదీ నుండి మండలంలో కంటివెలుగు ప్రారంభమవుతుందని తెలిపారు. కార్య క్రమంలో సర్పంచ్ తూటి రజిత, వైద్యాధికారి అమరేందర్, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు కొట్టె కుమార్, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, ఎంపీవో బైరి వేణు మాధవ్ పాల్గొన్నారు.

మంథని:ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే 'కంటి వెలుగు' ను వినియోగించుకోవాలని గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శంకరాదేవి కోరారు. వంద రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంథని అర్బన్ ఏరియాకు సంబంధించి స్థానిక జూనియర్ కళాశాలలో, మండలంలోని దర్మారం, సిరిపురంలో ప్రారంభమవుతుందన్నారు.

బల్దియాలో కంటి వెలుగు కేంద్రాల పరిశీలన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ప్రారంభించనున్న కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు పరిశీలించారు. 42వ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్ రాజస్థాన్ భవన్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, 19న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, అడ్డగుంట ఆసుపత్రి మెడికల్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనికేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' కరదీపిక ఆవిష్కరణ

జ్యోతినగర్: తెలంగాణ కంటి వెలుగు ఉచిత వైద్య శిబిరం ఈనెల 19న న్యూపోరట్‌పల్లిలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ డాక్టర్ అనిల్ కుమార్ ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సుమన్‌రావు అన్నారు. మంగళవారం న్యూపోరట్‌పల్లి ఎన్టీపీసీ సీఎస్సార్ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కరదీపికను కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో నేటి నుంచి కంటి వెలుగు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఆప్తమాలజిస్ట్ పి.పృథ్వీరాజ్ తెలిపారు. నేటినుంచి జూన్ 9 వరకు వివిధ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సింగరేణి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారు'

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియపై సింగరేణి కార్మికులను రామగుండం ఎమ్మెల్యే తప్పుతోవ పట్టిస్తున్నారని బీజేవైఎం నేత బద్రి దేవేందర్ విమర్శించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కోల్‌బ్లాక్ టెండరింగ్ ప్రక్రియను వక్రీకరిస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, మాజీ ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణపై చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బొగ్గు బ్లాకుల విక్రయాల ప్రక్రియ కొనసాగుతోందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రయివేటీకరణ, బొగ్గు బ్లాకుల విక్రయాల అర్థాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు సింగరేణి కార్మికులకు తప్పుడు సమాచారం ఇచ్చి రెచ్చ గొడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఇలవేణి అనిల్, రావుల స్వరాజ్, విజయ్ పాల్గొన్నారు.

'ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేరా?'

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలో మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. పట్టణంలో మంగళవారం గడపగడపకూ కాంగ్రెస్ లో భాగంగా 12, 29 వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు కనీసం తాగునీటిని అందించలేని స్థితిలో పాలకులున్నారని విమర్శించారు. అభివృద్ధి పేరిట రోడ్డు, డ్రైనేజీల కోసం యంత్రాలతో తవ్వకాలు చేపట్టి నెలల తరబడి ప్రజలను గోసపెడుతున్నారని ఆరోపించారు. డ్రైనేజీ పనుల కోసం సాగర్‌రోడ్డులో తవ్వించగా, ప్రజలు తమ ఇళ్లలోకి వెళ్లేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితులు కల్పించారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు జరిగిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే అధికారం అప్పగించి మెరుగైన పాలన అందించే అవకాశం కల్పించాలన్నారు. నాయకులు బుషణవేన సురేశ్‌గౌడ్, సంపత్, మస్రత్, కుమార్, బొడ్డుపల్లి శ్రీను,జగదీశ్, శ్రీమాన్, సుధాకర్‌రెడ్డి, స్వరూప, అవినాష్, చందు, సర్వర్‌పాష, శోభ, మహేశ్, రంగు శ్రీను, ప్రణయ్ తదితరులున్నారు.

మమ అనిపించారు..!

- సభకు హాజరు కానీ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దేవక్క

రామగిరి: మండల సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని పలుమార్లు సమావేశంలో చర్చించినా.. అధికారులు మాత్రం సభకు హాజరుకావడం లేదు. అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. మండలంలో మిషన్‌భగీరథ పథకంలో తాగునీటి సరఫరాలో తీవ్ర విమర్శలు వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ దేవక్క అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీడీవో రమేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు త్వరలో పరిష్కారం


ప్రజలతో మాట్లాడుతున్న ఏడీఈ శ్రీనివాస్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో లో ఓల్టేజీ సమస్య త్వరంలో పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏడీఈ అడిచెర్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శ్రీనగర్‌కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పెద్దపల్లి ఎస్ఈ సుదర్శన్ దృష్టికి తీసుకెళ్లడంపై ఉన్నతాధికారుల ఆదేశాలతో డివిజన్‌లో పర్యటించామన్నారు. అవసరమున్న ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెరువు మీదుగా ఉన్న విద్యుత్ తీగెలను సరిచేసి ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన సేవలను అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్ కుమార్, ప్రభాకర్‌రావు, నాగరాజు, మహేందర్‌రెడ్డి, జయశంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాంట్రాక్టు కార్మికులు ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, సెప్టెంబర్ 26న చేసుకున్న ఒప్పందాన్ని సైతం యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. మూడేళ్లుగా సీఎంపీఎఫ్ చిట్టీలు అందక కాంట్రాక్టు కార్మికులు అయోమయానికి గురి అవుతున్నారన్నారు. ప్రతినెలా 7న వేతనాలు చెల్లించాలని యాజమాన్యం ఆదేశాలున్నా అమలు చేయడం లేదన్నారు. బెల్ట్ క్లీనింగ్ సేల్‌పికింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాల్సిన యాజమాన్యం వారి శ్రమను దోచుకుంటుందన్నారు. వెంటనే జీవో 22 అమలు చేయాలని లేకుంటే సింగరేణి వ్యాప్తంగా మరోసారి సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.వెంకన్న, అశోక్, తోకల రమేష్, నరేష్, బుచ్చమ్మ, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

వైకే ఫౌండేషన్ సేవలు అభినందనీయం

యైటింక్లయిన్‌కాలనీ: వైకే ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని హైదరాబాద్ సెంట్రల్ ఏసీపీ రామదాసు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని లంబోదరా కల్చరల్ అకాడమీ తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతి లో జరిగిన జాతీయస్థాయి వివేకానంద అవార్డునును వైకే ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రక్తదానాలు చేస్తూ ప్రాణాలను కాపాడడం చాలా గొప్ప విషయమని అన్నారు. అనంతరం వైకే ఫౌండేషన్ అధ్యక్షుడు కండెం సురేశ్ మాట్లాడుతూ అవార్డు రావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి కిశోర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఐకాన్ అవార్డు అందుకున్న సాయికిశోర్

సుల్తానాబాద్‌రూరల్: కరోనా సమయంలో చేసిన సేవలకు వైకే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడ్డి సాయి కిశోర్ గౌడ్ వివేకానంద జాతీయ స్థాయి ఐకాన్ అవార్డును మంగళవారం హైదారాబాద్‌లో అందుకున్నాడు. వివేకానంద 160వ జయంతి సందర్భంగా హైదారాబాద్‌లోని రవీంద్ర భారతీలో శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ రామదాసు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ సేవలను గుర్తించి అవార్డును ఇచ్చినందుకు సాయికిశోర్ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బ్రాహ్మణ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

మంథని: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే బ్రాహ్మణగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి కోరారు. మంగళవారం మంథనిలోని బ్రాహ్మణ సంఘంలో గర్జన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంథని బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు అవదానుల వసంత శర్మ, రామగుడు మారుతి, మోహన్ శర్మ, కొల్లారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్జీ–2లో సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలో మంగళవారం సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 608 క్వార్టర్లకు 155 మంది దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌కు 55మంది హాజరయ్యారు. వీరిలో 47 మందికి క్వార్టర్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, టీబీజీకేఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఈఈ ప్రతాపగిరి, సీనియర్ పీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి

ధర్మారం: మండలంలోని కటికెనపల్లిలో ఈ నెల 21న ఎల్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మెగా వైద్య శిబిరం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, మార్కెట్ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, రాసూరి శ్రీధర్, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్యోతిబసుకు నివాళి

రామగుండం: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జ్యోతిబసు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రామగుండం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి, గుండు కనకయ్య, తుంగపిండి మల్లేశ్, వై.సత్యనారాయణ, మామిడి సతీష్, వెంకటేశ్, కృష్ణ తదితరులున్నారు.

నేడు మల్లికార్జునస్వామి నాగవెల్లి పట్నం

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మల్లికార్జునస్వామి కేతమ్మ దేవతామూర్తులకు నాగవెల్లి పట్నం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి తెలిపారు. నాగవెల్లి అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మేదరిబస్తీ ఏరియాలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.